అర్హులకు పథకాలు ఇచ్చేందుకే..

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పండగ వాతావరణంలో జగనన్న సురక్ష
- లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ



జగనన్న సురక్షలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, చిత్రంలో డాక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

కాకినాడ: ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష వినూత్నమైన కార్యక్రమమని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నగరంలోని వివిధ డివిజన్లలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక సాంబమూర్తినగర్, జగన్నాథపురం మున్సిబ్‌జంక్షన్, జగన్నాథపురం ఉన్నతపాఠశాల, ప్రతాప్‌నగర్ రామాలయం ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆదాయ, జనన, మరణ, వివాహ సహా 11 రకాల ధృవీకరణ పత్రాలను ఈ కార్యక్రమం ద్వారా జారీ చేస్తున్నామన్నారు. గడచిన వారం రోజులుగా వలంటీర్లు, ఇతర సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలసి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను సేకరించి టోకెన్ నెంబర్లు ఇచ్చారన్నారు. వీటి ఆధారంగా నెల రోజుల పాటు వివిధ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన వారికి సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఇంటికే అందిస్తున్నామని, అదే తరహా జగనన్న సురక్ష కూడా ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని ఇస్తోందన్నారు. అర్హత కలిగి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దళారీ వ్యవస్థకు దూరంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లను వేగవంతంగా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మంజూరైన సర్టిఫికెట్లను అందజేశారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, చిట్నీడి మూర్తి, రాష్ట్ర ప్రచారకమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా పాలన

కాకినాడ రూరల్: ప్రభుత్వమంటే ప్రజలకు చేరువగా సేవలందించే వ్యవస్థగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం నుంచి 11 రకాలు సేవలను ప్రజలకు ఉచితంగా అందించే కార్యక్రమానికి శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలో కరప, కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్, కాకినాడ రూరల్ గంగనాపల్లి, నేమాం గ్రామాల్లో అధికారులతో కలిసి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు సంబంధిత ధ్రువపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఒకటో డివిజన్ రమణయ్యపేటలో కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్‌తో కలిసి ధ్రువపత్రాలను అందజేశారు. సచివాలయం-1ఏ వైద్యనగర్ పరిధిలో 238కి 235 దరఖాస్తులను పరిష్కరించి పత్రాలు అందించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి పొందే ధ్రువపత్రాలను సీఎం జగన్ సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే అందిస్తున్నారన్నారు. అటువంటి సీఎంను ఆశీర్వదించి అండగా ఉండాలన్నారు. కమిషనర్ మహేష్‌కుమార్, ఏడీసీ నాగనరసింహారావు మాట్లాడుతూ డివిజన్‌లో 1149 కుటుంబాల నుంచి 238 దరఖాస్తులు వచ్చాయన్నారు. నగరంలో లక్ష ఇళ్లకు 1.9లక్షల సమస్యలు సచివాలయాలకు వచ్చాయని వాటిన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. స్థానిక నాయకుడు వాసురెడ్డి సూరిబాబు, రవి, మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేట ఒకటో సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో కమిషనర్ మహేష్‌కుమార్

- గంగనాపల్లి సచివాలయం-1 పరిధిలో ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొని 475 ధ్రువపత్రాలను అందజేశారు. సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, జేఏసీవీ మండల కన్వీనరు గీసాల శ్రీను, ఆర్డీఓ సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.
- అలాగే నేమాంలో 1071 దరఖాస్తులకు 1049 ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, జెడ్పీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి, తహసీల్దార్ మురార్జీ తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక 49వ డివిజన్ సచివాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై వలంటీర్లకు పలు సూచనలిచ్చారు. ఎంఎల్‌ఓ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి కడియాల చిన్న, పాలిక రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి గురు పౌర్ణమి వేడుకలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు భక్తిగీతాల పోటీలు నిర్వహిస్తామన్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తిగల వారు 90005 87009 మొబైల్ నెంబరును సంప్రదించాలని కోరారు.అలాగే సోమవారం సాయంత్రం గురుపౌర్ణమి వేడుకలు జరుగుతాయని, అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వైభవంగా సాయి సత్యవ్రతాలు



సాయి సత్య వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వ్‌లైన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో సాయిబాబా రజతోత్సవాల్లో భాగంగా శనివారం సాయి సత్యవ్రతాలు వైభవంగా నిర్వహించారు. సుమారు వెయ్యి మంది మహిళలు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఏర్పాట్లు చేశారు.

3న ఇండియన్ క్రిస్టియన్ డే

కాకినాడ సిటీ: నగర ప్రాంత పాస్టర్ ఫెలోషిప్స్, ఏబీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహిస్తున్నట్లు బెరాకా బ్లెస్సింగ్ చర్చి, జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ గౌరవాధ్యక్షులు జోసఫ్ బెన్నీ, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ సీరం ఐజాక్ తెలిపారు. బెరాకా చర్చిలో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సోమవారం కాకినాడ మెక్లారిన్ హైస్కూల్లో నిర్వహించడం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాస్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. సమావేశంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జాయింట్ ట్రెజరర్ మిస్సా విజయకుమార్, ఫెలోషిప్ కాకినాడ రీజనల్ చైర్మన్ పరిమిఇస్సాక్ తదితరులు పాల్గొని బుక్‌లెట్లను విడుదల చేశారు.

కరపలో 73.36 శాతం పింఛన్ల పంపిణీ



పెనుగుదురులో వృద్ధురాలు సావిత్రికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ముత్యాలు

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో శనివారం 8,271 మందికి (73.36 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. ఈ మేరకు రూ.2.25 కోట్లు లబ్ధిదారులకు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఆది, సోమవారాల్లో నూరుశాతం పూర్తిచేయిస్తామని ఆయన చెప్పారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఉదయం 5.30 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

హింస, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా జీపు జాతా

కాకినాడ సిటీ: బాలికలు, మహిళలపై హింస అరికట్టాలని మద్యం, మత్తు పదార్థాలైన గంజాయి ఇతర మత్తు పదార్థాలను అరికట్టాలని ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం సాయంత్రం కాకినాడ సుందరయ్యభవన్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, మద్యం మత్తు పదార్థాలు గంజాయిలను నిషేధించాలని కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిపారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెండు రోజుల జీపు జాత నిర్వహించి, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, స్కూల్స్, కళాశాలల్లో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఐక్యవేదిక కన్వీనర్ సీహెచ్ రమణి అధ్యక్షత వహించగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థలో పోస్టులు భర్తీ చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న పోస్టులను కోర్టు ఆదేశాల మేరకు భర్తీ చేయాలని గోదావరి లైబ్రరీ అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పౌర గ్రంథాలయ శాఖ అనుమతి ఇచ్చిన గ్రేడ్-3 విభాగం 47, కోర్టు పెండింగ్‌లో ఉన్న 11 పోస్టులను భర్తీ చేయడంతో పాటు 2019లో పరీక్ష నిర్వహించిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గ్రామ స్థాయిలో డిజిటల్ గ్రంథాలయాలను నిర్మిస్తున్న ప్రభుత్వం వెంటనే లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేసి 20 ఏళ్లుగా నిరుద్యోగులుగా ఉన్న గ్రంథాలయ కోర్సు చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ తనిఖీ



బియ్యం సరఫరాను తనిఖీ చేస్తున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: స్థానిక దుమ్ములపేటలో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీని జేసీ ఎస్ ఇలక్కియ శనివారం తనిఖీ చేశారు. ఈనెల నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నామని, ప్రతి కార్డు దారుడికి బియ్యంతో పాటు రూ.16లకే కిలో గోధుమ పిండి అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ మరియు విటమిన్లు కలిపి బలవర్ధక పోషకాలుంటాయని జేసీ ఇలక్కియ వివరించారు. ఈ బియ్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రతి ఒక్కరూ వండుకుని తినాలని లబ్ధిదారులకు సూచించారు.

చట్టాలపై అవగాహన



సబ్ జైలులో పరిస్థితులను వలంటీర్లకు వివరిస్తున్న జడ్జి హరినారాయణ

కాకినాడ లీగల్: పారా లీగల్ వలంటీర్లకు న్యాయమూర్తులు, న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించారు. కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ పి.కమలాదేవి ఆధ్వర్యంలో శనివారం ఒకటో అదనపు సీనియర్ సివిల్ కోర్టులో పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ ఆధ్వర్యంలో వలంటీర్లను కాకినాడ సబ్ జైలుకు తీసుకువెళ్లి అక్కడి పరిస్థితులను వివరించారు.

జనసేన, టీడీపీలకు బుద్ధిచెప్పండి

- వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించండి
- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆచరణ సాధ్యం కాని హామీలతో జనసేన, తెలుగుదేశం పార్టీలు ప్రజల ముందుకు వస్తున్నాయని వీరికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా శనివారం పాండురంగస్వామి ఆలయ ప్రాంతంలో ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కొంతం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ఇచ్చాం.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో గడప గడపకూ



ఇంద్రపాలెంలో మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: నాలుగేళ్లగా సంక్షేమ పథకాలు ఇచ్చాం.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇంద్రపాలెం గ్రామస్తులను కోరారు. గ్రామంలో సచివాలయం-3 పరిధిలోని శ్రీనివాసనగర్, డ్రైవర్స్ కాలనీ, నేరేళ్లమ్మనగర్, అర్జున్ నగర్ తదితర ప్రాంతాలలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గడప గడపకు పర్యటించారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మీ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వప్న, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, గ్రామ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

అవినీతి అనకొండ వనమాడి

జేసీఎస్ కన్వీనర్ సుంకర సాగర్

కాకినాడ: కోట్లాది రూపాయల స్మార్ట్‌సిటీ నిధులను కమీషన్ల కక్కుర్తితో దుర్వినియోగం చేసి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా, అనకొండగా గుర్తింపు పొందారని జగనన్న కన్వీనర్లు, సారథులు (జేసీఎస్) కన్వీనర్ సుంకర విద్యాసాగర్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ సెంటర్ కోసం రూ. 70 కోట్లతో కొనుగోలు చేసిన కెమేరాల్లో కొండబాబు భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పైగా సీసీ నిర్వహణకు ప్రతి మూడు నెలలకు కోటిన్నర చెల్లించేలా తీర్మానాలు చేశారన్నారు. అయితే ప్రభుత్వం మారాక వాస్తవాలను పరిశీలిస్తే ఏడాదికి కోటిన్నర చెల్లించేలా కూడా కొన్ని సమస్యలు సీసీ నిర్వహణకు ముందుకు వస్తున్నాయని, దీనిని బట్టి ఏ కారణంతో వనమాడి ఒప్పందాలు చేసుకున్నారో అర్థం చేసుకోవచ్చునన్నారు. కాసుల కక్కుర్తితో ఈ-వాహనాల చార్జింగ్ స్టేషన్ కోసం అత్యధికంగా ఎస్ఎఫ్‌టి రూ.5400 చెల్లించేలా కాంట్రాక్టు ఒప్పుకోవడం వాస్తవం కాదా? అని నిలదీశారు. రూ.10 వేలకు వచ్చే విద్యుత్‌లైట్లకు కూడా రూ.46 వేలు చెల్లించడం ద్వారా ఆయన హయాంలో జరిగిన అవినీతి భాగోతాలు అర్థం చేసుకోవచ్చునన్నారు. టిడ్కో పథకంలో 2 వేల ఇళ్లు మంజూరైతే 4,500 మంది లబ్ధిదారుల వద్ద డీడీలు తీసుకుని అనేక అక్రమాలకు పాల్పడిన చరిత్ర వనమాడిదేనని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ చిట్నీడి మూర్తి మాట్లాడుతూ అభివృద్ధి అంటే ద్వారంపూడి హయాంలోనే జరిగిందని, అర్థంలేని విమర్శలు, ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు బాలాప్రసాద్, సత్తిబాబు, నాయకులు వాసిరెడ్డి జిన్ని, దుర్గ, చక్రవర్తి,పెంకే రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన బొప్పరాజు బృందం



కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన రాష్ట్ర జేఏసీ అమరావతి చైర్మన్ వెంకటేశ్వర్లు, నేతలు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు శనివారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి పి.దామోదర్, రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, రాష్ట్ర కో చైర్మన్ సంసాని శ్రీనివాసరావు, రాష్ట్ర క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, రాష్ట్ర వీర్వోల సంఘం జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు కలెక్టర్‌తో పాటు జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో 92 రోజులుగా వివిధ సమస్యల సాధనకు చేసిన ఉద్యమ కార్యాచరణకు అనుగుణంగా సాధించిన విజయాలను కలెక్టర్ కృతికా శుక్లాకు బొప్పరాజు వివరించారు. ఆదివారం ఉదయం స్థానిక రెవెన్యూ భవన్‌లో జరిగే విజయోత్సవ సభకు హాజరయ్యేందుకు ఇక్కడకు వచ్చిన సందర్భంగా జిల్లా అధికారులను కలిసినట్లు ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాధరావు శనివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు.

చంద్రబాబే దొంగ ఓట్ల సూత్రధారి : జమ్మలమడక



కాకినాడ రూరల్: దొంగ ఓట్ల సూత్రధారి మాజీ సీఎం చంద్రబాబు నాయుడేనని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజనల్ జోనల్ ఇన్‌చార్జి, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి ఆరోపించారు. కాకినాడ గైగోలుపాడులోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడు బయటపడుతున్న దొంగ ఓట్లు 2019 జనవరిలో చేర్చినవేనని అప్పటి ఎన్నికల ప్రధాన అధికారి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడే దొంగ ఓట్లు చేర్చినట్టు ఈనాడు, ఆంధ్రజ్యోతి దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. నాడు ఐటీ గ్రిడ్ పేరుతో డేటా తస్కరించి భారీగా దొంగ ఓట్లను టీడీపీ ప్రభుత్వం చేర్పించిందని, ఇప్పుడు ఆధార్ సీడింగ్‌తో బాగోతం వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణలో లోపాలను బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సవరించనున్నారన్నారు.

చీలిక పెదాలకు శస్త్రచికిత్సలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో శనివారం నుంచి చీలిక పెదాలకు శస్త్రచికిత్సలు ప్రారంభమయ్యాయి. డైస్ ఆధ్వర్యంలో 90 మంది బాధిత చిన్నారుల పేర్లను తల్లిదండ్రులు నమోదు చేయించారు. వీరందరికీ ముత్తూట్ ఫిన్ కార్ప్, జీజీహెచ్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు జరగనున్నాయి. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి జీజీహెచ్‌లోని సర్జరీ సెమినార్ హాల్లో శస్త్రచికిత్సలను ప్రారంభించి ముత్తూట్ ఫిన్ కార్ప్ ప్రతినిధులను కొనియాడారు. ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ రత్న భూషణ్ పర్యవేక్షణలో చికిత్సలు చేయనున్నారు. ముత్తూట్ ఫిన్ కార్ప్ ప్రతినిధులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి, జీజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

బోట్‌క్లబ్: లయన్స్ కాకినాడ ప్రొఫెషనల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో ఉన్న సత్య దంత వైద్యశాలలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ సీనియర్ సభ్యుడు నిమ్మకాయల వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి కార్తీక్, అభిషేక్, సతీష్, సువర్ణ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



వైద్యులను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైద్యులను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు అజ్జరపు సత్యనారాయణమూర్తి, కార్యదర్శి మంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కరోనా కాలంలో వైద్యుల సేవలు మరువలేనివని ఆయన అన్నారు. వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంతి వీసీ వైవీ రావు మాట్లాడుతూ వైద్యులు అందరికీ తమ వృత్తి ద్వారా సమాజ సేవ చేస్తారన్నారు. అనంతరం వైద్యులను సత్కరించారు. సంఘ కోశాధికారి చల్లా శ్రీనివాస నిరంజన్, సభ్యులు మాండలిక శాస్త్రి, కె.వెంకట్, బి.రవిచంద్ర, కురెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

జోకులతో ఒత్తిడి నుంచి ఉపశమనం

కాకినాడ రూరల్: వ్యక్తుల మధ్య బంధాలను పెంచే అద్భుతమైన మాధ్యమం జోక్ అని సినీ హాస్య నటుడు కాటమరెడ్డి అన్నారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ జోక్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాటమరెడ్డిని ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. జోక్ (తమాషా) గా మాట్లాడేవారు పక్కనుంటే మానసికంగా ఎంత ఒత్తిడి ఉన్నా చాలా ఉపశమనంగా ఉంటుందని కాటమరెడ్డి అన్నారు. అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్కిటెక్చర్ డే

అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ డే సందర్భంగా అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్కిటెక్చర్ యర్రంశెట్టి ప్రసాద్‌ను ఘనంగా సన్మాంచారు. ఆయన మాట్లాడుతూ ఆర్కిటెక్చర్లు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భవనాలను అందంగా వాస్తు, ఆరోగ్యాన్ని పెంపొందించే విధంగా డిజైన్ చేస్తారని అన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు వైద్యులు అడ్డాల సత్యనారాయణ, గౌరీ శేఖర్, సువర్ణరాజు, గుబ్బల లక్ష్మణ ప్రసాద్, కె.వెంకటరమణలను సత్కరించి సమాజంలో వైద్యుల పాత్రను వివరించారు.

వీధి వ్యాపారులకు వెన్నుదన్ను

- వడ్డీ లేకుండా రూ.10 వేల రుణం
- నగరంలో 8 వేల మందికి పైగా లబ్ధి



నాగమల్లితోట రోడ్డు పక్క వీధిలో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు

బోట్‌క్లబ్: రోడ్డు పక్కన వీధి వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలచి ఉపాధికి ఊతం ఇస్తోంది. వ్యాపారంలో పెట్టుబడి కోసం వడ్డీ లేకుండా రూ.10 వేల రుణాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటి వరకూ ప్రైవేటు వ్యాపారుల నుంచి రుణాలు తీసుకుని అధిక వడ్డీలు చెల్లిస్తూ లాభాలను అనుభవించలేని పరిస్థితి ఉండేది. రోజుకు రూ.500 సంపాదిస్తే దానిలో రూ. 300 నుంచి 400 వడ్డీలకే పోయేది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో వీరి కష్టాన్ని చూసి చలించి వడ్డీలేని రుణాలకు రూపకల్పన చేశారు. దీంతో నగరంలో 8 వేల మంది వీధి వ్యాపారులకు ప్రభుత్వం ఇటీవల రుణాలు ఇచ్చి తోడ్పాటు అందించింది.

టీడీపీ హయాంలో కొందరికే

టీడీపీ హయాంలో ముద్రవంటి రుణాలు కేవలం పచ్చ పార్టీ సానుభూతి పరులకు మాత్రమే జన్మభూమి కమిటీ సభ్యులు ఇచ్చేవారు. నేడు అలా కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వడ్డీ లేని రుణం అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణం అండగా నిలిచింది



బ్యాంకు రుణం ఎంతో తోడుగా నిలిచింది. బయట వ్యాపారుల దగ్గర నుంచి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకుని ఇబ్బందులు పడేవాడిని. ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఎంతో ఆసరాగా ఉంది.

చాట్ల శ్రీనివాస్‌రెడ్డి, అరటిపళ్ల వ్యాపారి

వడ్డీ భారం తగ్గింది



వ్యాపారం చేయాలంటే నిత్యం రూ.3 నుంచి రూ.4 వేలు పెట్టుబడి కావాల్సి వచ్చేది. ప్రైవేటు వ్యాపారుల నుంచి తెచ్చే రుణం వడ్డీలు కట్టడానికే సరిపోయేది. ప్రస్తుతం ప్రభుత్వ ఇస్తున్న సాయంతో రోజూ రూ.500 పైగా సంపాదిస్తూ కుటుంబంతో సంతోషంగా ఉన్నాం.

చల్లపల్లి తుకేశ్వరరావు, చిరువ్యాపారి

అర్హులైన చిరు వ్యాపారులకు రుణాలు



అర్హులైన ప్రతీ చిరు వ్యాపారికీ రుణాలు ఇస్తున్నాం. ప్రభుత్వమే తమకు వడ్డీ చెల్లిస్తుంది. వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను గుర్తించి రూ.10 వేలు రుణం ఇస్తున్నాం. సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణాలు ఇస్తున్నాం.

చందాల శ్రీవెంకట ప్రసాద్, ఎల్‌డీఎం, కాకినాడ జిల్లా